తెలంగాణభవన్‌లో విష్ణుతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హాస్టల్ ఫీజు మొత్తం చెల్లిస్తా

మంచిగా చదువుకో తమ్మీ ● దివ్యాంగ విద్యార్థికి కేటీఆర్ భరోసా

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఓ దివ్యాంగ విద్యార్థి కోచింగ్ పూర్తయ్యే వరకు హాస్టల్ ఫీజు చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. బాగా చదువుకో తమ్ముడు అని ప్రోత్సహిస్తూ ఆప్యాయతను పంచారు. దీంతో ఆ యువకుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఈ సంఘటన హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో చోటుచేసుకున్నది. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన గిడ్లే విష్ణు చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు తొడల వరకు కోల్పోయాడు. పదో తరగతి పూర్తిచేసిన విష్ణు.. కంప్యూటర్ శిక్షణ కోసం హైదరాబాద్ గాంధీనగర్‌లో ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. హాస్టల్ ఫీజు చెల్లించే స్థోమతలేక దిక్కుతోచలేదు. బీఆర్‌ఎస్ పార్టీ, కేటీఆర్ తన మనసులో మెదిలిందే తడవుగా తెలంగాణ భవన్ బాటపట్టాడు. ఆదివారం కేటీఆర్‌ను కలిసి తన సమస్య ను చెప్పుకున్నాడు. ఆ యువకుడి బాధలు విన్న కేటీఆర్ తక్షణమే స్పందించారు. 'కోచింగ్ పూర్తయ్యేవరకు హాస్టల్ ఫీజు చెల్లిస్తా. కష్టపడి బాగా చదువుకో తమ్ముడు' అని ఆ యువకుడికి కేటీఆర్ అభయం ఇచ్చారు. తనకు సాయంగా నిలిచిన కేటీఆర్‌కు ఈ సందర్భంగా విష్ణు కృతజ్ఞతలు తెలిపారు.

చారాణా కోడికి బారాణా మసాలా!

- 26 చెక్కుల పంపిణీకి 25 వాహనాలు, 100 మంది పోలీసులతో బందోబస్తా?
- రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుబారా ఖర్చుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 13 గ్రామాల్లో 26 సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీకి 25 వాహనాలను వినియోగించడం, ఏకం గా 100 మంది పోలీసులతో భద్రత క ల్పించడం ఏమిటని ప్రశ్నించారు. అసలు పంచిన చెక్కుల విలువెంత? 25 వాహనాలకు, 100 పోలీసుల జీతభత్యాలకు అయి న ఖర్చెంత? అని నిలదీస్తూ.. రేవంత్ సర్కారు పనితీరు 'చారాణా కోడికి బారాణా మసాలా' అన్నట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఓడిపోయిన అభ్యర్థికి చెక్కులు ఇవ్వడం, వాటిని పంపిణీ చేసేందుకు భారీగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను పక్కనపెట్టి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్‌తో చెక్కుల పంపిణీ చేయించడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రులు మహమూద్‌అలీ, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, ముఠాగోపాల్, సీనియర్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు

కేసీఆర్ స్ఫూర్తితో 29న దీక్షా దివస్

- 'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ తెచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న దీక్ష
- ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజది
- నాడు అండగా నిలిచిన 3 కోట్ల మంది
- ఇప్పుడూ అవే పరిస్థితులు, నిర్బంధాలు
- అదే స్ఫూర్తితో జాతీయ పార్టీలపై పోరు
- 26న జిల్లాల్లో సన్నాహక సమావేశాలు
- 33 జిల్లాలకు ఇన్‌చార్జుల నియామకం
- 9న నిమ్స్‌లో అన్నదానం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్ఫూర్తితో ఈ నెల 29న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వెల్లడించారు. 33 జిల్లా కేంద్రాల్లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో దీక్షా దివస్ చేపడుతామని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, పార్టీ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణపై కేసీఆర్ చెరగని ముద్రవేశారని, మళ్లీ ఆనాటి ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ, నాడు తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని స్మరించుకుంటూ, ఆ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు. ఈ దుర్మార్గ కాంగ్రెస్ పార్టీ, బీజేపీకి బుద్ధి చెప్పేందుకు కదం తొక్కుతామని చెప్పారు. 29న కార్యక్రమ విజయవంతానికి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు 33 జిల్లాలకు సీనియర్ నాయకులను ఇన్‌చార్జులుగా నియమించినట్టు వెల్లడించారు. ఈ నెల 26న అన్ని జిల్లాల్లో సన్నాహక సమావేశాలు, 27, 28 తేదీల్లో ఏర్పాట్లకు కసరత్తు చేపట్టనున్నట్టు

తెలిపారు. కేసీఆర్ తన దీక్షను ముగించిన డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. ఆ రోజున పార్టీ నాయకులంతా పెద్ద ఎత్తున ఉత్సవాలు చేస్తూ తెలంగాణ తల్లికి ప్రణమిల్లాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ దీక్షతో ఉద్యమానికి నిమ్స్ దవాఖాన కేంద్ర బిందువుగా మారిందని గుర్తుచేశారు. అందుకే డిసెంబర్ 9న నిమ్స్ దవాఖానలో అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఆనాటి కార్యక్రమాలు, ఉద్యమ జ్ఞాపకాలను మళ్లీ గుర్తు తెచ్చేలా మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో' నినాదంతో దీక్ష

అరవై ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ గులాబీ జెండాను ఎగురవేశారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి, ఉద్యమ చరిత్రపై చెరిగిపోని సంతకం చేసిన మహా నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. '2009 నవంబర్ 29న కేసీఆర్ నాడు చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజ అని గుర్తు చేశారు. స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినమని తెలిపారు. ఆనాడు 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో' అని తెగువ చూపిన నాయకుడికి 3కోట్ల మంది తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో అండగా నిలబడ్డారని, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి, కులాలకు, మతాలకు అతీతంగా అందరినీ కలిపిన సందర్భం దీక్షా దివస్' అని కేటీఆర్ గుర్తుచేశారు.

దీక్షాదివస్ జిల్లాల ఇన్‌చార్జులు

ఆసిఫాబాద్	నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ
ఆదిలాబాద్	వీజీ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ
నిర్మల్	శేరి సుభాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ
మంచిర్యాల	తుల ఉమ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్
నిజామాబాద్	ఫరూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ
కామారెడ్డి	ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
మెదక్	వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ
సంగారెడ్డి	భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ
సిద్దిపేట	యాదవరెడ్డి, ఎమ్మెల్సీ
రంగారెడ్డి	మహమూద్ అలీ, ఎమ్మెల్సీ
వికారాబాద్	నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ
మేడ్చల్	స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్సీ
మహబూబ్‌నగర్	క్యామ మల్లేశ్
నారాయణపేట	కోటిరెడ్డి, ఎమ్మెల్సీ
గద్వాల	కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ
వనపర్తి	ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్
నాగర్‌కర్నూల్	విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ
నల్లగొండ	మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ
సూర్యాపేట	బండా నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్
భువనగిరి	పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ
జనగామ	బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే
వరంగల్	ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే
హనుమకొండ	వాణీదేవి, ఎమ్మెల్సీ
ములుగు	డాక్టర్ సుధీర్‌కుమార్, మాజీ జడ్పీ చైర్మన్
మహబూబాబాద్	కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే
భూపాలపల్లి	సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ
ఖమ్మం	తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ
కొత్తగూడెం	వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ
కరీంనగర్	బండా ప్రకాశ్‌ముదిరాజ్, ఎమ్మెల్సీ
సిరిసిల్ల	బీ వినోద్‌కుమార్, మాజీ ఎంపీ
పెద్దపల్లి	కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి
జగిత్యాల	ఎండీ సలీం, మాజీ ఎమ్మెల్సీ
హైదరాబాద్	పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రి

రెండు జాతీయ పార్టీల మెడలు వంచుతాం

తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నే డు మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడిపై ఉన్నదని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'అప్పుడున్న సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు ఛిద్రమైందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ ఇప్పుడవే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. అవే నిర్బంధాలు, అవే అణచివేతలు, అవే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అందుకే దీక్షా దివస్ నుంచి స్ఫూర్తి పొంది.. కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి 4 కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకోవడానికి మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. 'స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష' అన్న ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో పోరాడుదామని చెప్పారు. ఈ రోజు ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని, ఆనాటి పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. దాని కోసం ప్రజలంతా కలిసికట్టుగా ముందు కెళ్లాల్సిన సందర్భం వచ్చింది' అని కేటీఆర్ చెప్పారు.

ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేశ్ బిగాల

ప్రపంచవ్యాప్తంగా దీక్షా దివస్

- బీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన నవంబర్ 29న ప్రపంచవ్యాప్తంగా దీక్షా దివస్ కార్యక్రమాన్ని చేపడతామని బీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు. ఆనాడు తెలంగాణ సమాజం యావత్తు కేసీఆర్ వెంట నిలవడంతో కేంద్రం దిగొచ్చి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనాటి దీక్షా దివస్ స్ఫూర్తి, అమరుల త్యాగాలు, పోరాటాలు ప్రపంచదేశాల్లో తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేయడంపై ఆమెతో మాట్లాడినట్టు వెల్లడించారు.

28న సింగరేణి స్ట్రక్చర్ సమావేశం

పెద్దపల్లి, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులు 11నెలలుగా ఎదురు చూస్తున్న స్ట్రక్చర్ మీటింగ్‌కు ఎట్టకేలకు తేదీ ఖరారైంది. ఈ నెల 28న కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో సమావేశం జరుగనున్నది. నిరుడు డిసెంబర్ 28న ఎన్నికలు జరగగా గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ గెలుపొందాయి. మూడు నెలలకోసారి సమావేశాలు జరగాల్సి ఉన్నది. 11నెలలైనా కార్మికుల సమస్యలపై స్ట్రక్చర్, జేసీసీ సమావేశాల ఊసే లేదు. సమావేశంలో సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

మా ఇల్లు బఫర్‌జోన్ పరిధిలోకి రాదు

- నిబంధనల ప్రకారమే నిర్మాణం
- ప్రచారంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ
- 25 ఏండ్ల క్రితమే కృష్ణకాంత్ పార్క్ ఏర్పాటు చేశారని వెల్లడి

హైదరాబాద్ సిటీ బ్యూరో, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'హైదరాబాద్ మధురానగర్‌లో ఉన్న మా ఇల్లు బఫర్ జోన్ పరిధిలోకి రాదు. ఇరిగేషన్ నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం జరిగింది' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఇల్లు బఫర్ జోన్‌లో ఉన్నట్టుగా బయట జరుగుతున్న ప్రచారం నమ్మొద్దని, దానికి సంబంధించిన మ్యాప్‌లు, ఫొటోలను విడుదల చేశారు. తమ తండ్రి ఏపీవీ సుబ్బయ్య 1980లోనే ఈ ఇంటిని నిర్మించారని, తాము 44 ఏండ్లుగా అదే ఇంటిలో నివాసం ఉంటున్నామని తెలిపారు. 25 ఏండ్ల క్రితమే కృష్ణకాంత్ పార్క్ ఏర్పాటైందని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం.. చెరువు కట్ట ఎత్తుపై ఆధారపడి దిగువన 5-10 మీటర్ల దూరంలో బఫర్ జోన్ ఉంటుందని, తమ ఇల్లు చెరువు కట్టకు కిలోమీటర్ దూరంలో ఉన్నదని పేర్కొన్నారు. కృష్ణకాంత్ పార్క్ స్థలంలో 25ఏండ్ల క్రితం ఒక చెరువు ఉండేదని, తాము ఉంటున్న నివాసం దానికీ దూరంగానే ఉన్నదని తెలిపారు. తమ ఇల్లు బఫర్ జోన్ పరిధిలో లేదన్న వాస్తవాన్ని గ్రహించాలని కోరారు.

రోల్డ్‌తో గోల్డ్ రుణాలు!

- బ్యాంకర్లకు కేటుగాళ్ల బురిడీ
- పోలీసుల అదుపులో నిందితులు?

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): ఖమ్మం డీసీసీబీ, రెండు పెద్ద బ్యాంకులు, ఓ గ్రామీణ బ్యాంకును కేటుగాళ్లు బురిడీ కొట్టించినట్టు తెలుస్తున్నది. నకిలీ బంగారం తాకట్టు పెట్టి పెద్దఎత్తున రుణాలు పొందినట్టు నగరంలో ప్రచారం జరుగుతున్నది. మూడు నెలల నుంచి మోసగాళ్లు పక్కా ప్లాన్‌తో బ్యాంకుల అధికారులను నమ్మించి రుణాలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. మోసపోయిన సంగతిని డీసీసీబీ బయటపెట్టింది. మిగిలిన రెండు పెద్ద బ్యాంకులు, ఓ గ్రామీణ బ్యాంకు అధికారులు మాత్రం అధికారికంగా చెప్పకపోయినప్పటికీ నగరంలో ఆ నోటా ఈ నోటా ఇదే చర్చ నడుస్తున్నది.

కేటీఆర్‌పై కేసుల కుట్ర

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి నిమగ్నమైనట్టు కేటీఆర్‌పై నమోదవుతున్న కేసులే చెప్తున్నాయి. అమరవీరుల స్మృతి చిహ్నం ముందు తెలంగాణ కవి, వాగ్గేయకారుడు గోరటి వెంకన్నతో కేటీఆర్ జరిపిన ఇష్టాగోష్ఠి (ప్రత్యేక ఇంటర్వ్యూగా) అన్ని చానళ్లు టెలికాస్ట్ చేశాయి. అమరవీరుల స్మృతి చిహ్నం ముందు ఇష్టాగోష్ఠి నిర్వహించినందుకు కేటీఆర్‌పై సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేయించడమే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు పరంపర కొనసాగిస్తున్నది. బాధ్యతాయుత ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సర్కార్ అడ్డదారులు వెతుకుతున్నదని, అధికార, అనధికార సైన్యాన్ని మోహరించి ఎలాగైనా.. కేటీఆర్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని రేవంత్ సర్కార్ అహర్నిశలూ శ్రమిస్తున్నదనే చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తున్నది. చట్ట వ్యతిరేకంగానైనా కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలనే కుట్రలు కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. కేటీఆర్ ఎక్కడ నిరసన తెలిపితే అక్కడ కేసు పెట్టాలె అన్న ధోరణితో సర్కార్ వ్యవహరిస్తున్నదని, ఇందుకు ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులే సాక్ష్యమనే వాదనలు వినిపిస్తున్నాయి.

కేటీఆరే ఎందుకు టార్గెట్?

'ఓటుకు నోటు కేసు'లో రూ. 50 లక్షలతో కెమెరాల ముందు అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జైల్లో పెట్టిన విషయం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా ఎలాగైనా కేసీఆర్ కుటుంబంలో ఒకరిని.. అందులో కేటీఆర్‌ను జైల్లో వేసి తన రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటానని రేవంత్‌రెడ్డి

ప్రమాణ స్వీకారానికి ముందురోజు బాహాటంగానే తన సన్నిహితులతో చెప్పినట్టు ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కేటీఆర్‌ను జైలుకు పంపిస్తానంటూ సమయం దొరికినప్పుడల్లా ప్రకటిస్తూనే ఉన్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అటు అసెంబ్లీలో ఇటు ప్రజాక్షేత్రంలో కేటీఆర్ తన ప్రశ్నలతో ముప్పుతిప్పలు పెడుతున్నారని, కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యాలను నిత్యం ఎండగడుతూనే ఉన్నారని, వీటికితోడు ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల అవినీతి బాగోతాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచుతున్నారని, మూసీ, అమృత్ టెండర్లు, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టు, ఫార్మా విలేజ్ పేరిట భూదందాలు, ఫార్మా సిటీ భూముల్లో ఫోర్త్‌సిటీ పేరిట రియల్ ఎస్టేట్ దందా ప్రయత్నాలపై తన వద్ద నున్న ఆధారాలను కేటీఆర్ ప్రజల ముందు పెడుతున్నారని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డిలో అసహనం పెరిగిపోయిందని చెప్తున్నారు. మరోవైపు కేటీఆర్ తమకు కొరకరాని కొయ్యగా, కంట్లో నలుసుగా తయారయ్యారని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు సైతం చెప్తున్నాయి. ఈ క్రమంలో కేటీఆర్‌ను నిలువరించాలంటే అరెస్టు ఒక్కటే దారిగా రేవంత్‌రెడ్డికి కనిపిస్తున్నదని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

తగ్గేదే లేదంటున్న కేటీఆర్

అక్రమంగా కేసులు పెట్టి అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. కేటీఆర్ మరింత ఉత్సాహంతో ప్రజల తరపున పోరాటం చేస్తున్నారని బీఆర్‌ఎస్ శ్రేణులు చెప్తున్నాయి. కేసులతో తనను భయపెట్టాలని చూస్తే అంతకన్నా మూర్ఖత్వం మరోటి ఉండదని కేటీఆర్ ఈ విషయంలో తెగేసి చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రజల కోసం చేసే పోరాటంలో సంతోషంగా జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమేనని, ఒక్కసారి కాదు అవసరమైతే వందసార్లు అయినా తాను జైలుకు వెళ్లటానికి సిద్ధమని కేటీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి చౌకబారు రాజకీయాలకు పాల్పడినంత మాత్రాన ప్రజల పక్షాన తన గొంతును వినిపించక మాననని, తన ప్రశ్నను సంధించకుండా ఆపనని ఆయన కరాఖండిగా చెప్తున్నారు. తనపై నమోదైన మొత్తం కేసులపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర డీజీపీకి కేటీఆర్ లేఖ రాసినా డీజీపీ కార్యాలయం నుంచి స్పందన లేకపోవటం గమనార్హం.

కేటీఆర్‌పై ఆరు కేసులు నమోదు

కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారంటూ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ కేటీఆర్‌పై కేసులు నమోదవుతుండడం గమనార్హం. అమరవీరుల స్థూపం వద్ద ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా దీనిపై హైకోర్టు స్టే విధించింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో, మేడిగడ్డలో అనుమతి లేకుండా డ్రోన్ కెమెరా వాడారని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో, ముఖ్యమంత్రిని 'చీప్ మినిస్టర్' అంటూ సంబోధించారని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో, మూసీ ప్రాజెక్ట్‌పై చేసిన వ్యాఖ్యలకు ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో, చార్మినార్ వద్ద నిరసన తెలిపినందుకు చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఇందులో చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షాపై కేసు నమోదు చేసినా ఆధారాలు లేవని ఆ కేసును కొట్టివేశారు. కానీ కేటీఆర్‌పై కేసును మాత్రం కొనసాగిస్తున్నారు.

'సుప్రీం' మార్గదర్శకాల విస్మరణ

కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలన్న ఉత్సాహంలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విస్మరిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాపాలన అని గొప్పలు చెప్పే రేవంత్‌రెడ్డి సర్కార్ కేటీఆర్ ప్రశ్నించటాన్ని తట్టుకోలేకపోతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వేధింపుల్లో భాగంగానే న్యాయస్థానాల్లో నిలవలేని, పసలేని కేసులను కేటీఆర్‌పై నమోదు చేస్తున్నారని చెప్తున్నారు. ఒకే అంశానికి సంబంధించి పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయకూడదనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే చట్టాన్ని తుంగలో తొక్కుతూ కేసులు పెడుతున్నారని, ఐటీ యాక్ట్‌ను కూడా దుర్వినియోగం చేస్తూ కేటీఆర్‌పై కేసులు పెట్టేందుకు తహతహలాడుతున్నారని స్పష్టంచేస్తున్నారు.

డైవర్షన్ పాలి'ట్రిక్స్'

ఆరు గ్యారెంటీల అమలు, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైన రేవంత్‌రెడ్డి సర్కార్ డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేస్తున్నదని మొదటి నుంచీ విమర్శలు వస్తున్నాయి. కేటీఆర్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయటం, ఆయనకు అవినీతి బురద అంటించటం ద్వారా కేటీఆర్ లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, పీసీసీ ప్రెసిడెంట్ వరకు అంతా కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

అమిత్‌షాకోనీతి.. కేటీఆర్‌కో న్యాయమా?

చట్టం దృష్టిలో తమకు అందరూ సమానమేనని బయటికి చెప్తూ అది నిజమేనని నమ్మించేందుకు అప్పుడప్పుడూ బీజేపీపై విమర్శలు చేస్తున్నారే తప్ప కేటీఆర్, బీఆర్‌ఎస్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని గులాబీ శ్రేణులు చెప్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంతో బీజేపీ చీకటి స్నేహం కొనసాగుతున్నదని, చార్మినార్ వద్ద నిరసన వ్యక్తం చేసిన అంశానికి సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మీద సాక్ష్యాధారాలు లేవని ఎఫ్‌ఐఆర్‌ను కూడా కొట్టివేశారని, ఇదే కేసులో కేటీఆర్‌పై నమోదైన కేసును మాత్రం కొనసాగిస్తున్నారని, బీజేపీ, కేటీఆర్ విషయంలో కాంగ్రెస్ తీరుకు ఈ ఒక్క ఉదాహరణ చాలని స్పష్టంచేస్తున్నాయి.

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై

ప్రతీకార రాజకీయాల సంస్కృతిని రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిననాటి నుంచే మొదలుపెట్టారని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామంటూ ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ ప్రెసిడెంట్ బహిరంగ ప్రకటనలు చేయటమే అందుకు నిదర్శనమని పేర్కొంటున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సియోల్ వేదికగా 'బాంబులు పేలుతాయి' అని, తొర్రూరు వేదికగా 'పేలేది ఆటంబాంబు.. అణుబాంబు' అని కేటీఆర్ అరెస్టుపై తన కుతూహలాన్ని చాటుకుంటూనే ఉన్నారని, బీజేపీ నేతలు కూడా కేటీఆర్‌నే టార్గెట్ చేశారని చెప్తున్నాయి. ప్రతిపక్షంగా అధికార పార్టీపై పోరాటం చేయాలనే స్పృహను మరిచి కేటీఆర్‌పైనే బీజేపీ నేతలు కూడా ఆరోపణలు చేస్తున్నారని, ఆయన అరెస్ట్ ఖాయమంటూ వాళ్లు కూడా ప్రకటనలిస్తున్నారని, బీఆర్‌ఎస్‌ను అణచివేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయని గులాబీ శ్రేణులు సైతం మండిపడుతున్నాయి.

గోప్యంగా మూసీ ప్రాజెక్టు

- ప్రాజెక్టు వ్యవహారాలు అతి రహస్యం
- మూసీపై నోరెత్తని అధికారులు
- మౌఖిక ఆదేశాలే కారణమా?
- అనుమానాలు రేకెత్తిస్తున్న గోప్యత

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): లక్షల కోట్ల ప్రాజెక్టు.. వేలమంది నిర్వాసితులు, అయినా రెవెన్యూ నుంచి పట్టణాభివృద్ధిశాఖ వరకు ప్రధాన శాఖలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి కలల మూసీ ప్రాజెక్టు కోసం పరితపిస్తున్నాయి. వివరాలను గోప్యంగా ఉంచుతున్న అధికారులు ప్రాజెక్టు పురోగతిపై చర్చించకుండానే గుట్టుగా వ్యవహారాలు నడిపిస్తున్నారు. అయినప్పటికీ ఏదోరకంగా ఈ బాగోతాలన్నీ సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఎజెండాను ఎత్తుకున్నప్పటి నుంచే వివాదం ప్రారంభమైంది. అయినప్పటికీ ప్రాజెక్టును పూర్తిచేసి తీరాలనే ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ఇందుకోసం ఏర్పాటు చేసిన మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మీడియాకు చిక్కకుండా వ్యవహారాలు చక్కబెడుతున్నది. ఇప్పటికీ నోటీసులు అందుకుంటున్న మూసీ పరీవాహక ప్రజలు కోర్టు మెట్లు ఎక్కుతూనే ఉన్నారు. లక్ష కోట్ల ప్రజాధనంతో ప్రాజెక్టులు చేపడుతున్నప్పుడు పారదర్శకత అవసరం. కానీ, ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టును గోప్యంగా చేపట్టాలని చూస్తుండటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతలతో విమర్శలు రావడంతో ప్రాజెక్టును గుట్టుచప్పుడు కాకుండా పూర్తిచేయాలని అధికారులకు మౌఖికంగా ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది. ఉన్నతాధికారుల వివరణ కోరితే దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు.

సీఎం చెప్పేది ఒకటి... అధికారులు చేసేది మరోటి

ఏమాత్రం రాజీలేకుండా మూసీ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తుంటే, అధికారులు మాత్రం పనులు జరగడం లేదని చెప్తున్నారు. డిజైనింగ్ బాధ్యతలు అందుకున్న మెయిన్‌హార్ట్ కంపెనీ అంతర్గతంగా సమావేశాలు నిర్వహిస్తున్నది. 'సేవ్ మూసీ' పేరిట ఆందోళనలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ విషయమై ఆరోపణలు చేస్తున్నాయి. తొలి దశలో 23 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నామని ప్రభుత్వ పెద్దలు బహిరంగంగానే ప్రకటిస్తున్నా, ప్రాజెక్టు డిజైనింగ్‌లో ఏయే అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారనే కీలకమైన విషయాలను కూడా గోప్యంగా ఉంచడం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది.

గట్టమ్మ తల్లి పురాతన ఆనవాళ్లు గుర్తించిన ప్రదేశం వద్ద పరిశోధకులు, పూజారులు

గట్టమ్మ పురాతన మూలాలు గుర్తింపు

ములుగు రూరల్, నవంబర్ 24: ములుగు జిల్లా కేంద్రం పరిధిలోని ఆది దేవత గట్టమ్మ తల్లి పురాతన మూలాన్ని ఆదివారం సమ్మక్క-సారక్క సెంట్రల్ ఆర్కియాలజీ బృందం పరిశోధకులు, గట్టమ్మ పూజారులు గుర్తించారు. ఈ సందర్భంగా గట్టమ్మ పూజారి కొత్త సురేందర్ మాట్లాడుతూ.. ఆదివారం పలు గిరిజన యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు గట్టమ్మ పరిసరాల్లో పరిశోధనలు చేయగా గట్టమ్మ చరిత్రకు సంబంధించిన ఆధారాలు లభ్యమైనట్టు తెలిపారు. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర కొండగుహల్లో ఉన్నట్టు పరిశోధన బృందం గుర్తించినట్టు పేర్కొన్నారు. కొత్త అనే ఇంటి పేరు కలిగిన వంశీయులు జాతర నిర్వహణ కొండ ప్రాంతంలో నడిపారని అన్నారు. వెతుకులాటలో పురాతన కాలం నాటి శిలాశాసనం లభ్యమైందని చెప్పారు. ఆచార వ్యవహారాలకు సంబంధించి కూడా కొన్ని ఆధారాలు లభ్యమైనట్టు పూజారి పేర్కొన్నారు.